

నేడు పిజిఆర్ఎస్ రద్దు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో మోస్తారు నుంచి భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో సోమవారం జరగనున్న పిజిఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక)ను రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ వివరించారు.

నేడు పిజిఆర్ఎస్ రద్దు

సీతంపేట : జిల్లాలో మోస్తారు నుంచి భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో సోమవారం జరగనున్న పిజిఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక)ను రద్దు చేసినట్లు ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పిఒ తెలిపారు.

శిథిలాల నడుమ సంక్షేమం

- పెచ్చులూడిన పైకప్పు
- బీటలు వారిన గోడలు
- ఊడిపోయిన కిటికీలు
- పగటిపూట తరగతి గదులే... రాత్రి వేళ పడక గదులు
- పద్మాపురం ఆశ్రమ పాఠశాల గిరిజన విద్యార్థుల దుర్భర జీవనం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి / పాచిపెంట

పెచ్చులూడిన పైకప్పు. బీటలు వారిన గోడలు, ఊడిపోయిన కిటికీలు. పగటి పూట తరగతి గదులే... రాత్రి అయ్యేసరికి పడక గదులు. ఇదీ పాచిపెంట మండలం పద్మాపురం బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాలలో దుస్థితి. భవన సముదాయం బయటకు సాధారణ పాఠశాల, వసతి గృహంలో కనిపిస్తున్నా.... లోపల అడుగుపెట్టగానే విద్యార్థుల కష్టజీవితం కళ్లముందు కదిలాడుతోంది. సంక్షేమం శిథిలాల మధ్య నడుస్తోంది. భవనం ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకుంది. విద్యార్థుల సంక్షేమం, వసతులు, ఇతర ఇబ్బందులను తెలిసుకునేందుకు ఈ ఆశ్రమ పాఠశాలలను ప్రజాశక్తి సందర్శించింది. హృదయ విదారకరమైన సన్నివేశ దృశ్యాలు తారసపడ్డాయి.

ఈ వసతి గహంలో 243 మంది విద్యార్థులు ఉన్నారు. అందుకు తగ్గట్టు వసతులు, ఇతర సదుపాయాల్లేవు. ఇక్కడి సమస్యలు, విద్యార్థుల ఇబ్బందులు మాటల్లో చెప్పలేవి. ఎంత చెప్పినా తక్కువే వసతి గృహ ప్రాంగణమంతా బురద, బుగ్గితో కనిపించాయి. పటుత్వం కోల్పోయిన భవనాల్లో విద్యార్థుల చదువులు సాగుతున్నాయి. ఇవి కూడా సరిపోక ఆరుబైట చెట్ల కింద కూడా తరగతుల నిర్వహణ సాగుతోంది. మంచాలు, పరుపులు వంటివి లేవు సుమా...! పాపం... పగటి పూట చదువులు సాగిస్తున్న గదులే... రాత్రి అయ్యేసరికి పడక గదులు.



భోజనం కోసం ఆరుబైట నిరీక్షిస్తున్న విద్యార్థులు

కూర్చున్నచోటే పడుకోవడం అంటే ఎంత కష్టతరంగా ఉంటుందో వేరేగా చెప్పనక్కర్లేదు. "సార్, నేల చల్లగా ఉంటోంది. పాము వస్తుందేమోనని రాత్రంతా భయపడుతుంటాం" అంటూ పలువురు బిక్కుబిక్కుమంటూ ప్రజాశక్తి ఎదుట వాపోయారు. చాపలపై నిద్రించే పిల్లలు పక్కనే బ్యాగులు పెట్టుకొని తలదిండుగా వాడుకుంటున్నారు. కిటికీల్లోంచి చల్లగాలి దూసుకురావడంతో చిన్నారులు ముడుచుకుని నిద్రిస్తున్నారు. కప్పుకోవడానికి దుప్పట్లు కూడా లేవని చాలా మంది విద్యార్థులు చెబుతున్నారు. మరుగుదొడ్లు కూడా తగినన్ని లేక విద్యార్థుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. బహిరంగ ప్రదేశాల్లోకి వెళ్లాల్సి వస్తోంది. "చాలాసార్లు వర్షం పడితే బయటకు వెళ్లలేం. ఇబ్బందులు తలెత్తుతాయి," అని పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి చెబుతున్నాడు. ఇక సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయుల పరిస్థితి చూస్తే.... 'కక్కలేక... మింగలేక' అన్నట్టుగా ఉంది. పాడుబడ్డ షెడ్‌లోనే వంట చేస్తున్నారు. డైనింగ్ హాలు లేక విద్యార్థులు నేలపై కూర్చొని భోజనం చేస్తున్నారు. వసతి గృహం చుట్టుపక్కల వాతావరణం కూడా ప్రమాదకరంగా మారింది. వర్షాకాలంలో పాములు, విషసర్పాలు



శిథిలమైన కిటికీలు

చొరబడడం సాధారణమైపోయింది. తమ బిడ్డలు చదువుకుంటే తమలా ఇబ్బందులు పడకుండా ఉంటారన్న అమాయక తల్లిదండ్రుల ఆశలు వారికి తెలియకుండానే అడియాశలవుతున్నాయి. కొందరి తల్లిదండ్రులకు ఇక్కడి దారుణాలు తెలిసినా ప్రశ్నించే చొవర లేకపోవడం ప్రభుత్వానికి, పాఠశాల నిర్వాహకుల నిర్లక్ష్యానికి అడ్డూ ఆపులేకుండా పోతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న భవనం నుంచి సురక్షితమైన భవనంలోకి విద్యార్థులను తరలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకుంటే భవిష్యత్తులో విద్యార్థులు ప్రమాదాల బారినపడే అవకాశాలున్నాయి.



పెచ్చులూడిపోయిన తరగతి భవనం శ్లాబ్

మొంథా తుపానుపై అప్రమత్తం : మంత్రులు

27నుంచి 29వరకు విద్యాసంస్థలకు, అంగన్‌వాడీలకు సెలవు

ప్రజాశక్తి - పార్వతీపురం

బంగాళాఖాతంలో ఏర్పడ్డ మొంథా తుపాను పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి కె.అచ్చెన్నాయుడు, రాష్ట్ర గిరిజన సంక్షమశాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కలెక్టర్‌ను, ఎస్‌పిలను ఆదేశించారు. సోమవారం జరిగే గ్రీవెన్స్‌ను కూడా రద్దు చేయాలని సూచించారు. అలాగే అన్ని మండలాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని, వ్యాధులు ప్రబలే ప్రమాదం ఎక్కువగా ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా అవసరమైతే విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించాలన్నారు. వాగులు, వంకలు దాటే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, కొండచరియలు విరిగిపడే అవకాశమున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. సహాయక చర్యలు ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు.

27నుంచి 29 వరకు విద్యా సంస్థలకు సెలవు : కలెక్టర్

మొంథా తుపాను నేపథ్యంలో జిల్లాలోని విద్యా సంస్థలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు ఈనెల 27 నుంచి 29వరకు సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే తుపాను నేపథ్యంలో మోస్తారు నుంచి భారీ వర్ష వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఎటువంటి ప్రాణ, ఆస్తి, పంట నష్టాలు జరగరాదని, ఇందుకోసం ముందుగా గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలను అప్రమత్తం చేయాలని స్పష్టం చేశారు. జిల్లా అధికారులకు శాఖల వారీగా విధులను కేటాయించడం జరిగిందని, అప్పగించిన బాధ్యతలను పాటించాలని అన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేదీ లేదని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం నుంచి జిల్లాలో భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున లోతట్టు, నదీ పరీవాహక ప్రాంతాల్లోని ప్రజలను దండోరా, మైక్ ద్వారా ప్రచారం చేస్తూ అప్రమత్తం చేయాలని అన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయడం, రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని అన్నారు.

కురుపాం : మొంథా తుపాను హెచ్చరికల నేపథ్యంలో మండలంలోని అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి అన్నారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి అప్రమత్తం చేసి ఎవరికి ఎటువంటి సెలవులు మినహాయింపుల్లేన్నారు..

వీరఘట్టం : తుపాను పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక తహశీల్దార్ ఎఎస్ కామేశ్వరరావు వీఆర్వోలను ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. రాత్రివేళల్లో నది వద్దకు గ్రామస్తులను వెళ్లనీయకుండా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు గ్రామాల్లో పరిస్థితులను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు పాల్గొన్నారు.

తగ్గిన పత్తి దిగుబడి

- అధిక వర్షాలతో నష్టపోయిన రైతులు
- ఎకరాకు రెండు నుంచి మూడు క్వింటాళ్లే

ప్రజాశక్తి - సాలూరు

భారీ వర్షాలకు పత్తిరైతు చిత్తైయ్యాడు. ఎక్కువ వర్షాల వల్ల పంట పూర్తిగా దిగుబడి తగ్గడంతో రైతులు కన్నీరుమున్నీరై రోధిస్తున్నారు. మండలంలో సుమారు 1500 ఎకరాల వరకు పత్తి పంటను సాగు చేస్తున్నారు. పత్తి విత్తనాలు మొదలుకొని ఎరువులు, రసాయనాలు, కలుపుతీత, తదితర అన్ని ఖర్చులు కలిపి ఎకరానికి రూ.30వేలు నుంచి రూ.40 వేలు వరకు రైతులు పెట్టుబడులు పెడుతున్నారు. కౌలు రైతులు అదనంగా రూ.10వేలు నుంచి రూ.12 వేలు వరకు అదనంగా పెట్టుబడులు పెడుతున్నారు. పత్తి పంట మొదట కాయలు, పూత మంచిగా పెరగడంతో ఈ ఏడాది మంచి ఆదాయం వస్తుందని ఆశతో రైతులు ఎంతో ఆనంద పడ్డారు. అయితే గత కొన్ని రోజులుగా నిత్యం వర్షాలు కురుస్తుండడంతో రైతుల ఆశలు ఆవిరైపోతున్నాయి. ఎడతెరిపి లేకుండా పడుతున్న వర్షాలకు పత్తి మొక్కలు ఎర్రబడి పత్తి కాయలు కుళ్లిపోతున్నాయి. మరోపక్క కాయలు పగిలి పత్తిని తీసుకొనేందుకు వీల్లేకుండా పోయింది. వర్షాలకు పత్తి తడిసి తీయలేని పరిస్థితికి రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఉన్న కొద్దిపాటి పత్తిని కూలీలతో అధిక కూలీని ఇచ్చి తీయించుకొని ఆరబెట్టుకుంటున్నారు. గతేడాది ఎకరానికి పత్తి పంట ఎనిమిది నుండి పది క్వింటాలు వరకు దిగుబడి వచ్చేంది. కానీ ఇప్పుడు ఈ అకాల వర్షాలతో ఎకరానికి రెండు నుండి మూడు క్వింటాలు వస్తాయో రావోనన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు తీసిన పత్తిని ఆరబెట్టుకోవడానికి కూడా ఏ రోజు పూర్తిగా ఎండ ఎక్కిన దాఖలాల్లేవు. దీంతో చాలామంది రైతులు ఇళ్లల్లోని ఆరబెట్టుకునే పరిస్థితులు దాపురించాయి. అలాగే ధర కూడా అమాంతంగా పడి పోయింది. రూ.4వేలు నుంచి రూ.5500 వరకే ప్రస్తుతం వ్యాపారులు అడుగుతున్నారు. ఇదే పత్తి పంట గతేడాది రూ.7200 నుండి రూ.12వేలు వరకు



వీధుల్లో ఆరుబయట పత్తిని ఆరబెడుతున్న రైతులు

వ్యాపారస్తులు కొనుగోలు చేశారు. కానీ అటువంటి పరిస్థితులు ఈ ఏడాది మచ్చుకైనా ఎక్కడా కనిపించడం లేదు. వస్తున్న దిగుబడులకు మార్కెట్లో కనీసం ధర లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు ఉన్నాయి. ఈ తరుణంలో ప్రభుత్వం సరైన మద్దతు ధరను ఇచ్చి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లయితే రైతుకు కొంతమేరకు ఉపశమం కలుగుతుందని, నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారాన్ని చెల్లించేలా ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం పత్తి కొనుగోలు చేయాలి

నేను మూడు ఎకరాల్లో పత్తి పంటను వేసి ఎకరాకు రూ.35 వేలు వరకు ఖర్చు పెట్టాను. ఈ ఏడాది అధిక వర్షాల వల్ల ఖర్చుపెట్టిన డబ్బులైనా వస్తాయో రావోనన్న భయంతో ఉన్నాను. దీనికి తోడు ఈ ఏడాది ధర కూడా అమాంతంగా తగ్గిపోయింది. పత్తి కొనుగోలు చేసే నాధుడే లేడు. ప్రభుత్వమే మాలాంటి నష్టపోయిన రైతులు వద్ద పత్తిని కొనుగోలు చేసి ఆదుకోవాలి.

పూజారి, శ్రీనివాసరావు,
రైతు, మామిడిపల్లి.

రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి

అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి. నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ.25వేల వరకు నష్ట పరిహారాన్ని అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. పంటను ప్రభుత్వమే చివరివరకు కొనుగోలు చేసి రైతుకు నష్టం చేయకుండా ఆదుకోవాలి.

మర్రి శ్రీనివాసరావు,
వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షులు

ముడుపులతో విచారణ కప్పివేత!

- బయటపడని నిధుల దుర్వినియోగం
- డిపిఒ, డిఎల్‌పిఒలు విచారణ జరిపినా చర్యలు శూన్యం

ప్రజాశక్తి - కొమరాడ

గత నాలుగేళ్లగా పంచాయతీలో జరిగిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు దుర్వినియోగమైనట్లు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు చేసినప్పటికీ చర్యలు లేకపోవడంతో ప్రజలకు ప్రజాసమస్యల పరిష్కార వేదికపై నమ్మకం రోజురోజుకు కోల్పోతుంది. గత కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ ఉన్న సమయంలో కొమరాడకు సంబంధించిన పంచాయతీ నిధులు సుమారు రూ.40 లక్షల వరకు దుర్వినియోగమైనట్లు గ్రామస్తులు ఫిర్యాదులు చేశారు. దీనిపై అప్పట్లో కలెక్టర్ జిల్లా పంచాయతీ అధికారిని విచారణకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఇప్పటికీ దానిపై ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం పలు అనుమానాలకు దారితీస్తుంది. గతంలో జిల్లా పంచాయతీ అధికారి కొమరాడ గ్రామ సచివాలయానికి వచ్చి ఫిర్యాదుదారులను, అధికారులను విచారించారు. ఈ విచారణ నివేదికను బయటపెట్టకపోవడం పట్ల స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే రెండు రోజుల క్రితం జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మళ్లీ డిఎల్పిఒ ఉద్యోగులకు అనుకూలంగా విచారణ పూర్తి చేసి మమ అనిపించారని ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. నిధులు పక్కదారి పట్టినప్పటికీ చర్యలు, రికవరీ చేపట్టకుండా వెండర్ ఖాతా లేకపోవడం వల్లే సిబ్బంది అకౌంట్‌లో జమ చేసినట్లు దిగువ స్థాయి నుంచి వివరణ తీసుకొని చర్యలు చేపట్టకుండా విచారణ పూర్తి చేసినట్లు తెలిసింది. విచారణ అధికారులకు భారీగా ముడుపులు చెల్లించేందుకు ఒక్కొక్క పంచాయతీ కార్యదర్శి నుంచి సుమారు రూ.5000 నుంచి రూ.10వేలు వరకు ముడుపులు చెల్లించి ఎటువంటి చర్యలు లేకుండా చేసేందుకు సిబ్బంది ప్రయత్నిస్తున్నట్లు కూడా ఆరోపణలు వస్తున్నాయి.

కొమరాడ పంచాయతీ రూ.40 లక్షల వరకు నిధులు దుర్వినియోగమైనట్లు అధికారులు గుర్తించినప్పటికీ విచారణ పేరుతో నిర్లక్ష్యం చేస్తున్నారు తప్ప చర్యలు తీసుకోవడం లేదు. ఇతర పంచాయతీల్లోనూ ఇదే పరిస్థితి. కొమరాడ పంచాయతీకి సంబంధించి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఇంతవరకు ఇటువంటి చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. గత కలెక్టర్ బదిలీపై వెళ్లడంతో కొత్త కలెక్టర్‌కు ఈ విషయం తెలియకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు జిల్లా పంచాయతీ అధికారులంతా ఒక్కటై ఈ అవినీతి అక్రమాలను బయటకు రాకుండా నివేదికలు విచారణ చేసినట్లు లెక్కలు చెప్పడంపై మండల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి మండలంలోని అన్ని పంచాయతీలతో పాటు కొమరాడ పంచాయతీలో జరిగిన అక్రమాలపై చర్యలు చేపట్టి నిధులను రికవరీ చేసి పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



చర్యలు తీసుకొని నిధులు రికవరీ చేసినంత వరకు ఫిర్యాదులు

పంచాయతీలో నిధులు దుర్వినియోగంపై పూర్తిస్థాయిలో నిజనిర్ధారణలతో విచారణ జరిపి చర్యలు తీసుకుని రికవరీ చేయాలి. రెండు నెలల కాలం పూర్తయినా నేటికీ విచారణపై డిపిఒ స్పష్టత ఇవ్వలేదు. పంచాయతీ కార్యదర్శుల వద్ద నుంచి భారీగా డిపిఒ ముడుపులు తీసుకున్నట్లు అనుమానాలు ఉన్నాయి. అందుకే విచారణ జాప్యం చేయడం, చర్యలు లేకపోవడం, రికవరీ చేయకపోవడం జరుగుతుందని అనుమానాలు ఉన్నాయి. ప్రజల సమక్షంలో విచారణ జరిపి దారి మళ్లిన నిధులపై నిగ్గు తేల్చాలి. లేకుంటే మళ్లీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు చేస్తాం.

కసిన బోయిన రమేష్,
ఫిర్యాదుదారుడు, కొమరాడ



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రూ.50లక్షలు నష్టపరిహారం ప్రకటించాలి

- గిరిజన విద్యార్థుల మరణాలు ప్రభుత్వ హత్యలే
- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అనిల్
- నాలుగో రోజు కొనసాగిన జీపుయాత్ర

ప్రజాశక్తి - పాలకొండ / సీతంపేట

గిరిజన విద్యార్థుల మరణాలకు ప్రభుత్వ హత్యలేనని, ఇటీవల మరణించిన విద్యార్థిని కుటుంబానికి రూ.50లక్షలు నష్ట పరిహారం ప్రకటించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బి.అనిల్ డిమాండ్ చేశారు. విద్యా రంగం సమస్యల పరిష్కారం కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన జీపు యాత్ర ఆదివారం పాలకొండ, సీతంపేటలో కొనసాగింది. ఈ సందర్భంగా పాలకొండ పోస్టుమెట్రిక్ హాస్టల్‌లో విద్యార్థులు నిరసన తెలిపారు. అనంతరం అనిల్ మాట్లాడుతూ కురుపాం గురుకుల పాఠశాలలో వారం రోజుల్లో పి.అంజలి, టి.కల్పన అనారోగ్యంతో మృతి చెందారన్నారు. అలాగే మరో 12 మంది విద్యార్థులు అనారోగ్యంతో మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. కురుపాం గురుకుల పాఠశాలలో 611 మంది విద్యార్థులు 16 రూములు ఉంటున్నారని, ఒక రూమ్‌కు 40 మంది విద్యార్థులు ఉంటారని అన్నారు. హాస్టళ్లలో సురక్షితమైన మంచినీరు లేదని, ఆర్వో ప్లాంట్ ఉన్నా పని చేయడం లేదని, సరిపడా మరుగుదొడ్లు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలన్నారు. హాస్టళ్లలో ఎఎన్ఎంలను నియమించాలని, అనారోగ్యంతో మరణించిన 14మంది విద్యార్థుల కుటుంబ సభ్యులకు రూ.50 లక్షలు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే విద్యార్థులు తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు కె.కృష్ణ, శరత్, నాయకులు దినేష్, టి.అఖిల్ పాల్గొన్నారు.

యాప్‌తో వినియోగదారుల ఆరోగ్యం 'సురక్ష'తం

- నకిలీ మద్యం నిరోధానికే సురక్ష యాప్
- పరిమితంగా చీప్ లిక్కర్ పంపిణీ
- ఒడిశా నుంచి సారా అడ్డుకట్టకు చర్యలు
- 'ప్రజాశక్తి'తో ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎ.సంతోష్ ముఖాముఖి



రాష్ట్రంలో ఎక్సైజ్ శాఖ ఇటీవల రూపొందించిన సురక్ష యాప్‌తో నకిలీ మద్యం సులువుగా కనిపెట్టవచ్చునని, దీనితో వినియోగదారుల ఆరోగ్యం సురక్షితంగా ఉంటుందని జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎ.సంతోష్ చెప్పారు. 'ప్రజాశక్తి'తో ఆయన ముఖాముఖి మాట్లాడారు.

-ప్రజాశక్తి, పార్వతీపురం.

● జిల్లాలో నకిలీ మద్యం అమ్మకాలు జరుగుతున్నాయా?

అలాంటి ఆనవాళ్లు జిల్లాలో ఎక్కడా లేవు. ఉన్నట్టు ఆధారాలు చూపెడితే తగిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఉన్న మద్యం షాపుల్లో విస్తృత తనిఖీలు నిర్వహించాం. ఎక్కడా నకిలీ మద్యం ఉన్నట్లు రుజువు కాలేదు.

● సురక్ష యాప్‌తో ప్రయోజనాలేమిటి?

రాష్ట్రంలో నకిలీ మద్యం నిరోధానికి ప్రత్యేక యాప్‌ను ఎక్సైజ్ శాఖ రూపొందించింది. ప్రతి మద్యం బాటిల్‌పైనా ఒక క్యూఆర్ కోడ్ వుంటుంది. దాన్ని స్కాన్ చేస్తే ఆ మద్యం నకిలీదా, అసలైనదా అనేది కనిపెట్టవచ్చు. వినియోగదారులంతా ఈ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకోవచ్చు. ప్రతి మద్యం షాపు వద్ద యాప్‌పై అవగాహన కల్పించేందుకు బ్యానర్లు ఏర్పాటు ఏర్పాటు చేయనున్నాం.

● బెల్ట్ షాపుల నిర్మూలనకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?


జిల్లాలో బెల్ట్ షాపుల నిర్మూలనకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు అలాంటి షాపుల నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తాం. ఇంతవరకు జిల్లాలో 422 బెల్ట్ షాపులపై కేసులు నమోదు చేసి 422 మందిని అరెస్టు చేశాం. 679 లీటర్ల మద్యం సీజ్ చేశాం. ఒడిశా మద్యం విక్రయించిన వారిపై 3 కేసులు నమోదు చేశాం. ముగ్గుర్ని అరెస్టు చేసి 13లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నాం.

● నాటుసారా నిరోధానికి చేపడుతున్న చర్యలేమిటి?

ఒడిశాతో జిల్లాకు చుట్టూ సరిహద్దులు ఉన్న కారణంగా నాటుసారా ఎక్కువగా దిగుమతి జరుగుతోంది. దీనికి అడ్డుకట్ట వేయడానికి ఒడిశా ఎక్సైజ్ శాఖతో కలిసి జిల్లా ఎక్సైజ్‌శాఖ చర్యలు చేపడుతోంది. జిల్లాలో సారా విక్రయాలపై ఇంతవరకు 350 కేసులు నమోదు చేసి 483మందిని అరెస్టు చేశాం. 11,321 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నాం. సారా తయారీకి వినియోగించే 3టన్నుల 602 కిలోల బెల్లం సీజ్ చేశాం. 52 వాహనాలను స్వాధీనం చేసుకున్నాం. సారా అమ్ముతూ పదే పదే కేసులు నమోదైన వారిపై పిడి యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తాం. జిల్లాలో మూడు పిడి యాక్ట్ కేసులు నమోదు చేశాం. పార్వతీపురం పట్టణంలోని పెద్దరెల్లివీధికి చెందిన ఇద్దరు, మండలానికి చెందిన ఒకరిపై పిడి యాక్ట్ కేసులు నమోదు చేశాం. మూడు సారా కేసులు నమోదైన వారిపై పిడి యాక్ట్ కింద కేసు నమోదు చేయొచ్చు. దీని ప్రకారం ఒక ఏడాది జైలు శిక్ష పడుతుంది.

● సారా అమ్మకాలు ఉపాధిగా ఎంచుకున్న వారిపై చేపట్టిన ఏమిటి?

జిల్లాలో సారా తయారీ, విక్రయాలను ఉపాధిగా ఎంచుకున్న వారిలో మార్పు తీసుకురావడానికి ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమం చేపట్టింది. దీని ద్వారా ఎక్సైజ్ శాఖ గుర్తించిన 137 గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాం. గ్రామ సర్పంచ్, విఆర్వోలతో కమిటీలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నాం. ఇలాంటి వారిని జిల్లాలో 260 మందిని ఎంపిక చేశాం. వీరికి ఉపాధి కల్పన కోసం ప్రభుత్వానికి నివేదిక పంపించాం.



● వంద రూపాయల చీప్ లిక్కర్ మద్యం షాపుల్లో ఉండకపోవడానికి కారణమేంటి?

మద్యం వినియోగదారులకు తక్కువ ధరకు నాణ్యమైన మద్యం సరఫరా చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం వంద రూపాయల చీప్ లిక్కర్ క్వార్టర్‌ను ప్రవేశపెట్టింది. ఈ మద్యం షాపుల్లో అందుబాటులో వుంటోంది. అయితే పరిమితంగా షాపులకు చీప్ లిక్కర్ క్వార్టర్లను పంపిణీ చేస్తున్నాం.



ప్రజల నుంచి సంతకాలను సేకరిస్తున్న మాజీ డిసిఎం పుష్పశ్రీవాణి

పేదలకు వైద్యవిద్యను దూరం చేయడమే కూటమి లక్ష్యం

ప్రజాశక్తి - కురుపాం

పేద విద్యార్థులకు మెడికల్ విద్యను దూరం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంలో నడిపేందుకు చేస్తున్న ఆలోచనలను ప్రజలు తిప్పి కొట్టాలని మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి కోరారు. ఆదివారం కురుపాం మండలంలోని బియ్యాలవలస, శివన్నపేటలో కోటి సంతకాలు సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి వైద్య కళాశాలలు ప్రైవేటుపరం చేయడం వల్ల జరిగే నష్టం ప్రజలకు వివరించి సంతకాలు సేకరణ చేపట్టారు. పిపిపి పద్ధతిలో మెడికల్ కళాశాల నడపడం వల్ల వైద్య విద్య ఫీజులు మోత మోగుతుందని, ఉచిత వైద్యం మరింత భారం అవుతోందని అన్నారు. మండల కన్వీనర్ ఐ.గౌరీశంకర్, ఎంపిపి శెట్టి పద్మావతి, జడ్పీటీసీ సుజాత, జడ్పీ కో-ఆప్షన్ మెంబర్ షేక్ నిషార్, సర్పంచ్ సుజాత ,ఉపసర్పంచ్ ఆదిల్, ఎంపిటిసిలు స్వామియాజులు, బంగారు నాయుడు, సంతోషి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకొండ : నగర పంచాయతీలోని15,16,17,18,19 వార్డుల్లో, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ రచ్చబండ కార్యక్రమం, కోటి సంతకాల సేకరణ జరిగింది. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే వి.కళావతి మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వల్ల పేదలకు వైద్యం, విద్య అందని ద్రాక్షలా మారుతుందన్నారు. కావున ప్రజలంతా కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ వైసిపి అధ్యక్షులు, కౌన్సిలర్ వెలమల మన్మథరావు, కౌన్సిలర్లు దుప్పాడ పాపినాయుడు కడగల రమణ, కిల్లారి మోహన్, తుమ్మగుంట శంకరరావు, కోడెం బాబ్జీ, పల్లా భాను, నీలాపు శ్రీను, కోరాడ సూర్యనారాయణ కె.విజయ కుమార్, మిడితాన సూర్యనారాయణ, గార వెంకటరమణ, పైల అక్కయ్య, తుమ్మగుంట జగదీష్ , తుంబలి వాసుదేవరావు , దాసరి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రూ.10 లక్షలు ఆర్థిక సాయం అందించాలి

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో మరణించిన గిరిజన విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించి కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని టిఆర్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఐ.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన పత్రిక విలేకరులతో మాట్లాడుతూ గిరిజన ఓట్లతో గెలిచి ఎమ్మెల్యేలు, మంత్రి గిరిజన విద్యార్థులు మరణిస్తుంటే కనీసం వారికి చీమకుట్టినట్టైనా లేదని ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి తక్షణమే గిరిజన విద్యార్థులు మరణాలకు బాధ్యత వహిస్తూ ఆర్థిక సహాయం అందించి గిరిజన కుటుంబాలను ఆదుకోవాలని టిఆర్ఎఫ్ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు.

గుండెపోటుతో లైబ్రేరియన్ మృతి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సంక్షేమ గురుకుల కళాశాలలో లైబ్రరీగా ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న కె.రామలక్ష్మి కళాశాలలో విధులు నిర్వహిస్తుండగా ఒక్కసారిగా గుండెపోటుతో కొప్పుకూలి మృతి చెందారు. ఈమె బొక్కుపేట గ్రామానికి చెందిన వారు. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. రామలక్ష్మి మృతదేహాన్ని జిల్లా కో-ఆపరేటర్ మాణిక్యం, కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు.



దోనుబాయిలో ర్యాలీ చేస్తున్న పోలీసులు

దోనుబాయిలో పోలీసుల ర్యాలీ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని ధోనుబాయి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పోలీసుల అమరవీరుల వారోత్సవాలు సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై షేక్ మస్తాన్ మాట్లాడుతూ పోలీసులు అమరవీరుల స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ త్రినాథరావు, తదితరులు పాల్గొన్నారు.



శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎఎస్ఐ శ్రీనివాసరావు

మహిళల రక్షణ కోసమే శక్తి యాప్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మహిళల రక్షణకు ప్రభుత్వ తీసుకొచ్చిన శక్తి యాప్‌పై పట్టణంలోని వివిధ బాలుర, బాలికల హాస్టళ్ల విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కల్పించారు. శక్తి యాప్ డౌన్లోడ్ అండ్ రిజిస్ట్రేషన్, యాప్‌లో ఉండే 11 ఫ్యూచర్స్ ఉపయోగించే విధానం, శక్తి యాప్ టోల్ ఫ్రీ నెంబర్ 112, మహిళల రక్షణ చట్టం, పోక్సో యాక్ట్, సైబర్ క్రైమ్ 1930, డ్రగ్స్ 1972 , ఈగిల్, బాల్య వివాహం 1098, మొదలైన వాటి గురించి అవగాహన సదస్సు నిర్వహిస్తూ, ప్రభుత్వం మహిళల రక్షణ కోసం శక్తి యాప్ మార్చి 13న లాంచింగ్ చేయడమైందని ఎఎస్ఐ ఎల్.శ్రీనివాసరావు తెలిపారు. ప్రతి విద్యార్థిని తన మొబైల్ ఫోన్లో శక్తి యాప్ రిజిస్ట్రేషన్ చేసుకుని అందులో ఉండే 11 ఫ్యూచర్స్‌పై అవగాహన చేసుకుని ఆపద సమయంలో శక్తి యాప్ ఎలా వినియోగించుకోవాలో వివరించారు. కార్యక్రమంలో శక్తి బృందం సభ్యులు, మహిళ పోలీస్ సిబ్బంది రామలక్ష్మి, పద్మ, నిర్మల, పాల్గొన్నారు.

పార్కులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్‌లో ఆదివారం సెలవు దినం కావడం, అందులో కార్తీకమాసం కావడంతో పర్యాటకులు తరలివచ్చారు. పార్కులో సందడి చేశారు. జిల్లా నలుమూలల నించే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా పర్యాటకులు తరలివచ్చారు. పార్క్‌లో ఉన్న అందాలను ఆశ్వాదించారు. జలవిహార్ వద్ద బోట్ షికారు చేశారు. యువతీ యువకులు హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. మరి కొంతమంది థియేటర్‌లో సినిమాను వీక్షించారు. ఆల్ ట్రైన్ ఎక్కి చుట్టుముట్టారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించి జలకాలాడారు.



హేంగింగ్ నెట్‌పై సందడి చేస్తున్న బాలుడు

ఇచ్చిన నిధులు రద్దు చేస్తే

గిరిజన విద్య సాగేదెలా?

అర్ధాంతరంగా నిలిచిన గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల అదనపు భవనాలు

ప్రజాశక్తి - కురుపాం

గతంలో మంజూరైన అభివృద్ధి పనులు సగంలో నిర్మాణాల్లో ఉండగా నిధులు రద్దు చేస్తే ఎలా అని విద్యార్థుల తల్లిదండ్రులు, గిరిజన సంఘాలు మండిపడుతున్నాయి. స్థానిక గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.196.76లక్షలు నాబార్డు నిధులు మంజూరు చేశారు. నిర్మాణ పనుల్లో భాగంగా మూడుశ్లాబ్‌లు, రూముల కట్టడం సగం పూర్తైన తర్వాత సకాలంలో పెండింగ్ బిల్లు విడుదల చేయక పోవడమే కాకుండా మిగిలిన పనులు చేపట్టేందుకు అవసరమైన సుమారు కోటి రూపాయలు నాబార్డు నిధులు దారి మళ్లించి ఇక్కడ మంజూరు రద్దు చేశారు. ఫలితంగా భవన నిర్మాణాలు మూడేళ్లుగా అర్ధాంతరంగా నిలిచిపోయి పాఠశాల ఆవరణలో దిష్టిబొమ్మను తలపించేలా ఉంది. అలాగే గురుకులానికి ఇంటర్మీడియట్ మంజూరు చేసిన సందర్భంగా ఇంటర్ తరగతులు, కళాశాల భవనం నిమిత్తం ఎడ్యుకేషన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలెప్మెంట్ ఫండ్ కింద రూ.5కోట్లు మంజూరు చేశారు. గిరిజన ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో పనులు ప్రారంభించారు. కొద్ది రోజులకే నిధులు నిలిపివేయడంతో పునాది, ఫిల్లర్ ఫ్రేమ్‌లకే పనులు పరిమితమయ్యాయి. 609మంది చదువుతున్న పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన తరగతి, వసతి గదులు, కిచెన్, మరుగుదొడ్లు, ఇంటర్నల్ సిసి కాలువలు, సిసి రోడ్లు లేకపోవడంతో విద్యార్థులు ఏకకాలంలో రోగాల బారినపడుతున్నారు. స్వయంగా జిల్లా ఇన్చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పాఠశాలను సందర్శించి పాఠశాల వాతావరణం కల్పించలేకపోవటం దురదృష్టమన్నారు. వీలైనంత త్వరలో పాఠశాలను ఎపిలోనే మోడల్ గురుకుల పాఠశాలగా తీర్చి దిద్దుతామని హామీ ఇచ్చారు. కానీ మంత్రి ఆదేశాలు బేఖాతరు చేసిన జిల్లా యంత్రాంగం నేటికి రెండు వారాలు కావస్తున్నా ఒక్క రూపాయి కూడా పాఠశాల అభివృద్ధికి నిధులు విడుదల చేయలేదని సంబంధించిన ఇంజనీరింగ్ అధికారులు చెప్పకనే చెపుతున్నారు.



గురుకులంలో పిల్లర్స్ ఉసాలతో ఆగి ఉన్నటువంటి భవనం

ప్రతిపాదనలు పంపాం...నిధులు వస్తే అభివృద్ధి చేస్తాం

గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.కోటీ 65 లక్షలతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం. ప్రస్తుతానికి తాత్కాలిక వంటగది, వాటర్ ట్యాంక్‌ల మరమ్మతులు, మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేస్తున్నాం. నిధులు విడుదల లేకుండా అడుగు ముందుకు వేయలేని పరిస్థితి.

చాణుక్య, డిఇఇ.

వసతి గృహ విద్యార్థుల సమస్యలపై

చలించిన దాతలు

కంచాలు, తదితరాల సాయానికి హామీ

సమస్య పరిష్కరిస్తాం : ఐటిడిపి పిఒ యశ్వంత్‌కుమార్

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై పలువురు దాతలు స్పందించారు. వారికి అవసరమైన కంచాలు, తదితర సదుపాయాల కల్పనకు తమ వంతుగా సాయం అందిస్తామని ప్రజాశక్తికి చెప్పారు. 'మంత్రి ఇలాకాలో కంచాలు కరువు' అనే శీర్షికతో ప్రజాశక్తిలో రాష్ట్ర వ్యాప్త కథనం ఆదివారం వెలువడిన సంగతి తెలిసిందే. దీనికి స్పందించిన విశ్రాంత ఎల్‌డిఎం, రోటరీ క్లబ్‌మెంబర్ ఎ.శ్రీనివాసరావు విద్యార్థులకు కంచాలు సమకూరుస్తానని హామీ ఇచ్చారు. మా ఊరు - విజయనగరం స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు గుమ్మలూరు విశాలాక్షి కూడా విద్యార్థుల దయనీయ పరిస్థితిపై విచారం వ్యక్తం చేశారు. చాలా వసతి గృహాల్లో ఇటువంటి సమస్యలు ఉన్నాయని, తమ వంతు సాయంగా త్వరలోనే స్పందిస్తామని ప్రజాశక్తికి సమాచారం ఇచ్చారు. ఇంకొంత మంది అయ్యో... పాపం... అంటూ విద్యార్థులపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రజాశక్తితో పంచుకున్నారు. మరోవైపు మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్, ఇన్‌ఛార్జి ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి స్పందించారు. తోణాం తదితర హాస్టల్స్‌లోని సమస్యలపై గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సమగ్ర నివేదిక తెప్పించుకుని, అవసరమైన చర్యలు చేపడతానని ప్రజాశక్తికి సమాచారం ఇచ్చారు.



వ్యాధుల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జగన్మోహనరావు

వ్యాధులపై అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

వ్యాధులపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ, విద్యార్థుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని జిల్లా ఆర్‌బిఎస్‌కె అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు సూచించారు. పట్టణంలోని గూడ్స్ షెడ్ రోడ్‌లో(14 వ వార్డు) గల గిరిజన సంక్షేమ పోస్ట్ మెట్రిక్ బాలుర హాస్టల్‌ను ఆదివారం సందర్శించారు. హాస్టల్ ప్రాంగణం, పరిశుభ్రతపై పరిశీలించారు. విద్యార్థుల్లో ఎవరైనా అనారోగ్య సమస్యలతో ఉన్నారా అని వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు. సిక్ రూమ్ నిర్వహణపై తనిఖీ చేసి అక్కడ చికిత్స పొందుతున్న విద్యార్థి ఆరోగ్య సమాచారం తెలుసుకొని, ఆసుపత్రిలో అందజేసిన చికిత్సా వివరాలు ఒపి చీటిలో పరిశీలించారు. సిక్ రిజిస్టర్ పరిశీలించారు. హిమోగ్లోబిన్ రికార్డు తనిఖీ చేసి ఐరన్ మాత్రలు వేయిస్తున్న విధానంపై ఆరా తీశారు. తాగునీటి సదుపాయంపై వార్డెన్ అడిగి తెలుసుకున్నారు. నీటి నాణ్యతా పరీక్షలపై ఆరా తీశారు. ప్రతి వారం హాస్టల్‌లో డ్రైడే నిర్వహించాలన్నారు. అనంతరం పలు ఆరోగ్య అంశాలపై ఐఇసి ప్రదర్శిస్తూ డాక్టర్ జగన్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. చేతులను తరచుగా పరిశుభ్రం చేసుకోవాలని, పరిశుభ్రమైన నీరు నిర్ణీత వ్యవధిలో తాగుతూ ఉండాలన్నారు. రక్తహీనత,సీజనల్ వ్యాధులు, కామెర్లు, పరిశుభ్రత, రోగనిరోధకశక్తిపై వివరించారు. విద్యార్థుల్లో ఏ చిన్న అనారోగ్య లక్షణాన్ని గుర్తించినా తక్షణమే పరీక్షలు చేయించి చికిత్స అందించాలన్నారు. కార్యక్రమంలో వార్డెన్ టి.కృష్ణమోహన్, సూపర్వైజర్ జయగౌడ్ వైద్య సిబ్బంది ఉన్నారు.

కెజిబివిల్లో గ్రూప్-4 నియామకాలు ఎప్పుడో?

ఆసక్తితో ఎదురుచూస్తున్న అర్జీదారులు

ప్రజాశక్తి -వీరఘట్టం

స్థానిక కెజిబివి పాఠశాలలో టైప్-4 నియమకాలు ఎప్పుడంటూ ఆసక్తితో దరఖాస్తుదారులు ఎదురుచూస్తున్నారు. వార్డెన్ 1, పార్ట్ టైం టీచరు 1, హెడ్ కుక్ 1, అసిస్టెంట్ కుక్ 2, చౌకీదర్ 1, పోస్టులకు సంబంధించి 2025-26 సంవత్సరానికి తాత్కాలికంగా నియమకాలు జరిపేందుకు ఈ ఏడాది ఆగస్టు 13న దరఖాస్తుల స్వీకరణకు ప్రకటన వెలువడింది. అదే నెల 16 నాటికి ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తులు స్వీకరించాలని అధికారులు ప్రకటన చేశారు. దీంతో వీరఘట్టం, నడుకూరు గ్రామాలకు చెందిన వారే దరఖాస్తులు చేసుకోవాలని ప్రకటన చేశారు. వార్డెన్ పోస్ట్ కు సంబంధించి ఏడు దరఖాస్తులు, 1పార్ట్ టైం టీచర్‌కు పోస్టుకు సంబంధించి నాలుగు దరఖాస్తులు, కుక్, హెడ్ కుక్‌లకు 9 దరఖాస్తులు, చౌకీదారు పోస్టుకు సంబంధించి మూడు దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. అయితే అర్జీదారులు దరఖాస్తులు చేసుకొని దాదాపు 70 రోజులు కావస్తున్నప్పటికీ నియమకాలు జరిపించకపోవడమేమిటని దరఖాస్తుదారులు ప్రశ్నిస్తున్నారు. వచ్చిన దరఖాస్తులన్నీ మన్యం జిల్లా జిసిడిఒ అధికారులు తీసుకెళ్లినట్లు తెలిసింది. నియమకాలు జరిపించేందుకు అధికారులు ఏం చర్యలు తీసుకుంటారో ఆసక్తితో దరఖాస్తుదారులు ఎదురుచూస్తున్నారు. నియామకాలు జరుగుతాయా లేదా అన్నది దరఖాస్తుదారుల్లో ప్రశ్నార్థకరం మొదలయ్యింది.



కురుపాంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నారాయణరావు

సైబర్ నేరాలపై అప్రమత్తం

ప్రజాశక్తి - కురుపాం

సైబర్ క్రైమ్ నేరాల బారిన పడకుండా విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని ఎస్సై పి.నారాయణరావు అన్నారు. ఆదివారం స్థానిక పోస్ట్ మెట్రిక్ బాలుర హాస్టల్ వద్ద విద్యార్థులకు సైబర్ క్రైమ్ నేరాలు, యాంటీ డ్రగ్స్‌బారిన పడకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ ఫోన్ వాడుతున్న ప్రతి ఒక్కరూ కొత్త కొత్త నెంబర్ల నుంచి ఫోన్ చేసి ప్రలోభాలకు గురి చేస్తుంటారని, అటువంటి వాటికి మోసపోకుండా జాగ్రత్తగా ఉంటూ మత్తు పదార్థాలు, చెడువ్యసనాలకు బానిస కాకుండా విద్యార్థి దశనుంచే సక్రమంగా చదువుకొని ఉన్నత స్థానంలో స్థిరపడాలని సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ సిహెచ్ సాంబమూర్తి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట: స్థానిక పిఎంఆర్‌సి సమీపంలో యువతకు సైబర్ నేరాలపై ఎస్ఐ వైఅమ్మనరావు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు, ట్రాఫిక్ గురించి వివరించారు. రోడ్డు ప్రమాదాలు గురించి అవగాహన కల్పించారు. మితిమీరి వేగంతో వెళ్లరాదన్నారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ట్రిబుల్ రైడింగ్ చేయరాదని చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ముమ్మారంగా వాహన తనిఖీలు

వీరఘట్టం మండల కేంద్రంలోని ఒట్టిగడ్డ సమీపంలో ఆదివారం స్థానిక ఎస్సై జి కళాధర్ ఆధ్వర్యంలో ముమ్మారంగా వాహన తనిఖీలు చేపట్టారు. పెండింగ్ లో ఉన్న ఈ చలానికి సంబంధించిన వాహనాలను ముమ్మారంగా తనిఖీలు చేపట్టి అపరాధ రుసుము వసూలు చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల స్వైర విహారం

నియంత్రణపై దృష్టి పెట్టని ప్రజారోగ్య శాఖ అధికారులు

భయాందోళనలో పట్టణ ప్రజలు

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

పట్టణంలో కుక్కలు పగలు, రాత్రి అన్న తేడా లేకుండా స్వైర విహారం చేస్తుండడంతో ఆయా వార్డుల్లో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. పట్టణ ప్రధాన రహదారితో పాటు, పలు వార్డుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ, స్థానికులపై దాడులకు ఎగబడ్డ సందర్భాలు పట్టణంలో కోకొల్లలుగా ఉన్నాయి. రాత్రి వేళల్లో ఇవి సంచరిస్తూ పెద్ద అరుపులు అరవడంతో ప్రజలకు కంటిమీద కునుకులేకుండా పోతుంది. ఒకప్పుడు రాత్రి వేళల్లో మాత్రమే కుక్కలు సంచరిస్తూ ప్రజలపై దాడులు చేసేవి, కానీ ఇప్పుడు పగటిపూట కూడా వీధుల్లో రోడ్లపై నడవలేని పరిస్థితి దాపురించిందని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల పలు వార్డుల్లో కుక్కల దాడుల వల్ల గాయపడి ఆసుపత్రుల పాలై చికిత్స చేసుకున్న వారు పట్టణంలో ఎందరో ఉన్నారు. ఈ ఏడాది ఆగస్టు 16న పట్టణ పరిధిలో గల కొత్తవలస మణికంఠ కాలనీకి చెందిన గవర లోహిత్ అనే 4 ఏళ్ళ బాలుడు ఇంటి నుంచి బయటకు వచ్చిన సమయంలో కుక్క కాటుకు గురై ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన తర్వాత మరణించిన సందర్భం కూడా జరిగింది. పట్టణంలో కుక్కల నివారణకు ఏడాదిన్నర క్రితం మున్సిపల్ ప్రజారోగ్య, పశుసంవర్ధక శాఖ సంయుక్తంగా ఆడ కుక్కలను పట్టుకునే నిపుణులను తీసుకువచ్చి తూతూ మంత్రంగా కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేసి వాటికి కొన్ని రోజులు పర్యవేక్షణకు, ఆహారానికి బిల్లులు పెట్టుకున్నారనే విమర్శలు కూడా కార్యాలయంలో వినిపించాయి. అయితే కుక్కలకు అధికారులు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించిన తర్వాతే మున్సిపల్ పరిధిలో పలు వార్డుల్లో అధికమయ్యాయి, దీన్ని బట్టి అసలు ఆ సందర్భంలో కుక్కలకు శస్త్ర చికిత్సలు జరిగాయా, లేదా అన్న అనుమానం కూడా పట్టణ ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఇటీవల 24వ వార్డు కుమ్మరివీధిలో ఉన్న స్థానిక మహిళలు మున్సిపల్ ఎఫ్ఎసి కమిషనర్ జి.శ్రీనివాసరాజుకు కుక్కల సంచారం వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నామని ఫిర్యాదు చేశారు. సంబంధిత మున్సిపల్ అధికారులు ఈ కుక్కల సంచారం పై దృష్టి పెట్టి వాటిని నియంత్రించేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



వీధుల్లో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలి

ఇంటి ముందర మెట్లవద్ద, అరుగుల మీద పడుకుని బయట నుంచి తీసుకొచ్చే వ్యర్థాలను చిందరవందర చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఇంటి నుంచి బయటకు రావాలంటేనే భయమేస్తుంది. రాత్రి వేళల్లో వీటి అరుపుల మూలంగా నిద్ర పట్టడం లేదు. అధికారులు వీటిని నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలి.

వరద రాజేష్.
కన్యకా పరమేశ్వరి కోవెల వీధి.

జిల్లాలో పలుచోట్ల వర్షాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జిల్లాలో పలు మండలాల్లో ఓ మోస్తారు వర్షాలు ఆదివారం కురిశాయి. జియమ్మవలస గుమ్మలక్ష్మీపురం,మండలాల్లో ఆదివారం మోస్తరు వర్షం కురిసింది. సుమారు అరగంట పాటు కురిసిన వర్షంతో ప్రధాన రహదారులు, పంట పొలాల్లోకి నీరు చేరింది. చిరు వ్యాపారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మరో వైపు వరి పైరు పండి కోతకు వచ్చే సమయంలో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తుఫాను నేపథ్యంలో పై రెండు మండలాల్లో అధికారులు అప్రమత్తమై అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

వీరఘట్టంలో వర్షం

మండలంలోని ఆదివారం వర్షం కురిసింది. ఉదయం నుండి ఎండ తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ తుఫాను ప్రభావం వల్ల ఆకాశంలో ఒక్కసారిగా నల్లటి మబ్బులు ఏర్పడడంతో చిన్న చిన్న జల్లు పడి మరింత పెద్దదిగా మారింది.



గుమ్మలక్ష్మీపురంలో కురుస్తున్న వర్షం

డైట్‌లో ఖాళీ పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రభుత్వ ఉపాధ్యాయ విద్య శిక్షణా సంస్థ (డైట్) లో ఖాళీ ఉన్న సైకాలజీ 1, ఫైన్‌ఆర్ట్స్ 2 పోస్టులకు డెప్యూటేషన్ పద్ధతిపై (ఫారిన్ సర్వీస్) భర్తీ చేయడానికి ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఈ నెల 29లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె. రామ కృష్ణారావు ఆదివారం ప్రకటనలో కోరారు. ఖాళీగా ఉన్న మూడు పోస్టులకు 2025-26 విద్యాసంవత్సరానికి డెప్యూటేషన్ పద్ధతిపై భర్తీ చేస్తామన్నారు. ఆసక్తి కలిగిన ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపాలిటీ స్కూల్‌లో పనిచేస్తున్న అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్‌లు ఈ నెల 31 నాటికి 5సంవత్సరాలు స్కూల్ అసిస్టెంట్‌గా పూర్తి చేసిన వారు ఈ నెల 29లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పాఠశాల విద్యా సంచాలకులు ఆదేశాల మేరకు లీప్ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకొని ఫిజికల్ దరఖాస్తు, అర్హత సంబంధించిన ధ్రువ పత్రాలు జిల్లా విద్యా శాఖ ప్రత్యేక కౌంటర్‌లో 29లోగా అందజేయాలన్నారు. లీప్ యాప్‌లో దరఖాస్తు చేయని వారి దరఖాస్తులు తీరస్కరిస్తామని చెప్పారు.

జూదగాళ్లపై కేసు నమోదు

ప్రజాశక్తి- కంటోన్మెంట్

పట్టణంలోని ఐస్ ఫ్యాక్టరీ కూడలి సమీపంలోని ఒక ప్రయివేటు భవనంలో పేకాట శిబిరంపై ఆదివారం దాడి చేసి ఆరుగురుపై కేసు నమోదు చేశామని టూటౌన్ సిఐ టి. శ్రీనివాసరావు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.21,830 నగదు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాను దగ్ధం

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డు వద్ద శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బైకును ఢీకొని ఐసర్ వ్యాను పూర్తిగా దగ్ధ మైంది. పోలీసుల కథనం ప్రకారం విజయనగరం నుంచి సాలూరు వైపు గోనె సంచుల లోడుతో వెళుతున్న వ్యాను సాలూరు నుంచి రామభద్రపురం వస్తున్న బైకును ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. పాచి పెంట మండలం గడివలస గ్రామానికి చెందిన బెవర అప్పలనాయుడు అపాచీ ద్విచక్ర వాహనంపై బాడంగి మండలం రౌతువానివలస అత్తారింటికి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో బైకుపై ఉన్న వ్యక్తి తుల్లి పక్కన పడిపోగా బైక్ వ్యాను కింద ఉండిపోవడంతో మంటలు చెలరేగి వ్యాను పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో బైకిస్టుకు గాయాలు కావడంతో 108లో బాడంగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ వ్యాన్లో ఉన్న ఇద్దరు కూడా ప్రమాదం నుంచి బయట పడ్డారు. సమాచారం అందిన వెంటనే బాడంగి ఫైర్ ఆఫీసర్ రాంసూర్యారావు ఆధ్వర్యంలో సిబ్బంది వచ్చి మంటలని అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికీ ఆదివారం మధ్యాహ్నం వరకు మంటలు అదుపులోకి రాలేదు. ఎస్ఐ వెలమల ప్రసాదరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ప్రాణాపాయం లేకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

పెంకుటిల్లు దగ్ధం

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల పరిధిలోని కొట్టక్కి గ్రామంలో ఆదివారం ఉదయం జరిగిన ప్రమాదంలో ఒక పెంకుటిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదానికి విద్యుత్ షార్ట్ షర్క్యూటే కారణమని భావిస్తున్నారు. పెద్దాడ సాయిరాజ్ ఇంటిలో ఫ్రిజ్ ఒక్కసారిగా పేలిపోవడంతో ఒక్కసారిగా మంటలు ఇళ్లంతా వ్యాపించాయని తెలిపారు. ఈ ప్రమాదంలో ఎలక్ట్రికల్ సామాన్లు, బట్టలు, కొంత మేర నగదు కాలిపోయాయని బాధితుడు సాయిరాజ్ తెలిపాడు. సమాచారం అందుకున్న సాలూరు ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటల్ని అదుపులోకి తెచ్చారు. ఎస్ఐ వెలమల ప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఈ అగ్ని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

నేడు ప్రజా దర్బార్

ప్రజాశక్తి - కొత్తవలస

ప్రజా సమస్యల పరిష్కారం కోసం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజాదర్బార్ నిర్వహించనున్నామని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10గంటల నుంచి జరిగే గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నియోజకవర్గ ప్రజలందరూ వినియోగించుకో వాలని ఆమె కోరారు.

నిత్య అన్నదాన కార్యక్రమం ప్రారంభం

స్థానిక మరిడిమాంబ ఆలయ ప్రాంగణంలో ఏటా మణికంఠ సేవా పీఠం నిర్వహిస్తున్న నిత్య అన్నదాన కార్యక్ర మాన్ని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ప్రారంభిం చారు. గొరపల్లి రాము అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర దాసరి కార్పొరేషన్ చైర్మన్ పొట్నూరు వెంకట రత్నాజీ,తదితరులు పాల్గొన్నారు.